నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 7 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

కలెక్టర్‌ను కలిసిన సబ్ కలెక్టర్

ఆసిఫాబాద్‌టౌన్,సెప్టెంబర్ 6 : కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రద్ధ శుక్లా శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేను మార్యదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆమెకు సూచించారు.

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు మొక్క అందజేస్తున్న కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

మొన్న భట్టి.. నేడు సీతక్క

చెన్నూర్ నియోజకవర్గ పర్యటనకు మొహం చాటేస్తున్న మంత్రులు

- పర్యటన ఖరారైన తర్వాత రద్దు చేసుకుంటున్న వైనం
- నిరాశలో ఎమ్మెల్యే గడ్డం వివేక్-ఎంపీ వంశీ
- వివేక్‌కు చెక్‌పెట్టే లక్ష్యంతో ముందుకుసాగుతున్న పీఎస్సార్!
- నవ్వుకుంటున్న నియోజకవర్గ ప్రజలు
- సోషల్ మీడియాలో సెటైర్లు
- కేసీఆర్ పాలనలో క్యూకట్టిన మంత్రులు

మంచిర్యాల, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కేసీఆర్ సర్కారులో చెన్నూర్ నియోజకవర్గం ఓ వెలుగు వెలిగింది. అప్పటి ప్రభుత్వ విప్ బాల్క సుమన్ నిధుల వరద పారించి చెన్నూర్ నియోజవర్గాన్ని ప్రగతిపథంలో నడిపించి ఆదర్శంగా తీర్చిదిద్దారు. రాష్ట్ర మంత్రులను రప్పించి అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలకు శ్రీకారం చుట్టి ప్రశంసలు అందుకున్నారు. కానీ, కాంగ్రెస్ పాలనలో చెన్నూర్ నియోజకవర్గంలో పర్యటించేందుకు మంత్రులు మొహం చాటేసే పరిస్థితి ఏర్పడుతున్నది. తండ్రి ఎమ్మెల్యేగా, తనయుడు ఎంపీగా ఎన్నుకోబడిన చెన్నూర్ నియోజకవర్గంలో మంత్రులు షెడ్యూల్ ప్రకటించడం.. ఆపై పర్యటనలు వాయిదా వేసుకోవడాన్ని చూసి చెన్నూర్ ప్రజలు నవ్వుకుంటున్నారు. గత నెల 30న చెన్నూర్ నియోజకవర్గంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ పలు ప్రారంభోత్సవాలకు హాజరుకావాల్సి ఉండగా, చివరి నిమిషంలో వారి పర్యటనను రద్దు చేసుకున్నారు. కాగా చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావుల మధ్య పొసగకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. కాగా ఉప ముఖ్యమంత్రి, ఇద్దరు మంత్రుల పోగ్రాం రద్దు కావడం తండ్రీ కొడుకులైన వివేక్, వంశీలను నిరాశపరచగా, శుక్రవారం చెన్నూర్‌లో పలు అభివృద్ధి పనులకు హాజరుకావాల్సిన మంత్రి సీతక్క కూడా అదే బాటలో పయణించడం వారికి మింగుడు పడడం లేదు. శుక్రవారం చెన్నూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు హాజరుకావాల్సిన మంత్రి సీతక్క తన పర్యటనను ఒకరోజు ముందుగానే రద్దు చేసుకోవడంతో పాటు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఇంటికి వెళ్లి మరీ కలవడం విస్మయానికి గురి చేస్తున్నది. కాంగ్రెస్ పార్టీని వీడకుండా కష్టకాలంలోనూ పార్టీ వెన్నంటి ఉండి పని చేసి ఎమ్మెల్యేగా గెలిచిన ప్రేంసాగర్‌రావు.. పార్టీలు మారుతూ చివరికి కాంగ్రెస్‌లోకి వచ్చి ఎమ్మెల్యేగా గెలిచిన వివేక్‌కు చెక్ పెట్టాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

అసహనం వ్యక్తం ప్రజలు

గత నెలలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రుల ప్రారంభోత్సవాలు ఉన్నాయంటూ ప్రజలను సాయంత్రం వరకు ఉండేలా చేసి చివరి నిమిషంలో కార్యక్రమం రద్దయిందని చెప్పడంపై విస్మయం వ్యక్తమైంది. తాజాగా చెన్నూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనాల్సిన మంత్రి సీతక్క కార్యక్రమం కూడా రద్దు కావడంతో నియోజకవర్గ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తండ్రీకొడుకులు ఎమ్మెల్యే, ఎంపీలుగా ఉన్న నియోజకవర్గంలో రెండుసార్లు మంత్రుల కార్యక్రమాలు రద్దు కావడం చూసి సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి.

నాడు క్యూ కట్టిన మంత్రులు

కేసీఆర్ ప్రభుత్వంలో చెన్నూర్ నియోజకవర్గ పర్యటనకు ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మంత్రులు క్యూ కట్టారు. అప్పటి ఎమ్మెల్యే బాల్క సుమన్ అనేక అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు మంత్రులను ఆహ్వానించారు. అభివృద్ధి చెందిన నియోజకవర్గాలతో చెన్నూర్ కూడా పోటీ పడింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాటు అప్పటి మంత్రులు, కేటీఆర్, హరీశ్‌రావు, శ్రీనివాస్ గౌడ్, చామకూర మల్లారెడ్డి, అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, కొప్పుల ఈశ్వర్, నిరంజన్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎర్రబల్లి దయాకర్‌రావుతో పాటు పలువురు మంత్రులను తీసుకురాగా, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ఒక మంత్రి కూడా రాకపోవడం స్థానిక ఎమ్మెల్యే పనితీరుకు అద్దం పడుతుంది.

చెన్నూర్ పర్యటనకు వెళ్లాల్సిన మంత్రి సీతక్క హైదరాబాద్‌లో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఇంటికి వెళ్లి కలిశారు

మహారాష్ట్ర ఇంటర్నెట్ సిగ్నల్ కోసం వెతుకుతున్న యువకులు

జైనూర్‌లో పటిష్ట భద్రత

- ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల చర్యలు
- కొనసాగుతున్న 144 సెక్షన్
- ఇంటర్నెట్ లేక అవస్థలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఇటీవల ఆదివాసీ మహిళపై జరిగిన దాడి నేపథ్యంలో జైనూర్‌లో పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో పాటు రాష్ట్ర అడిషనల్ డీజీ మహేశ్‌భగత్, నార్త్ జోన్ ఐజీ చంద్రశేఖర్, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్, ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం, బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ రెండు రోజులుగా జైనూర్‌లోనే ఉంటూ పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. 144 సెక్షన్ శుక్రవారం కూడా యథావిధిగా కొనసాగింది. ఆధార్ కార్డు ఉంటే తప్ప జైనూర్‌లోకి ఎవరినీ అనుమతించడం లేదు. శుక్రవారం నుంచి గణేశ్ నవరాత్రోత్సవాలు ప్రారంభం కానుండగా, పోలీసులు మరింత బందోబస్తు పెంచే అవకాశమున్నది. కాగా, ఆసిఫాబాద్ నుంచి జైనూర్ మీదుగా వెళ్లే బస్సులను మూడు రోజులుగా రద్దుచేయడంతో ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాల డ్రైవర్లు ప్రజల వద్ద అందినకాడికి డబ్బులు దండుకుంటున్నట్లు తెలుస్తున్నది.

ఇంటర్నెట్ లేక అవస్థలు

కౌటాల, సెప్టెంబర్ 6 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలు నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాకలాపాలు నిలిచిపోయాయి. ముఖ్యంగా నగదు రహిత లావాదేవీలపై ప్రభావం పడింది. కౌటాల మండలానికి ఆనుకొని మహారాష్ట్ర ఉండడంతో కొంత మంది యువకులు సరిహద్దు ప్రాంతానికి వెళ్లి సెల్‌ఫోన్‌లలో నెట్‌వర్క్ చేంజ్ చేసుకుని అతి కష్టం మీద నెట్ వాడుతున్నారు.

డీఎస్పీ సదయ్యపై బదిలీ వేటు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 6 : జైనూర్ ఘటన నేపథ్యంలో ఆసిఫాబాద్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న పంతాటి సదయ్యపై పోలీస్ ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. సదయ్యను కాగజ్‌నగర్ డీఎస్పీగా బదిలీ చేయగా, కాగజ్‌నగర్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కరుణాకర్‌ను ఆసిఫాబాద్ డీఎస్పీగా బదిలీ చేస్తూ మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

మట్టి వినాయకులనే పూజిద్దాం

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, సెప్టెంబరు 6 : వినాయక చవితి పండగను పురస్కరించుకొని మట్టి వినాయకులను పూజించాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజించడం వల్ల చెరువులు, జలాశయాలు కలుషితం కావని, మట్టి వినాయకులను పూజించడం మన సంస్కృతి అని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో రూపొందించిన వినాయక విగ్రహాలతో నీరు,నేల కలుషితం అవుతుందన్నారు. అనంతరం చెరువు మట్టి – గణపతి మట్టి సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండల అధికారి నాగేశ్వర్‌రావు, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, డీఆర్‌డీవో కిషన్, అధికారుల సంఘం అధ్యక్షుడు దుర్గ ప్రసాద్, పర్యావరణ పరిరక్షణ కమిటీ నాయకుడు గుండేటి యోగేశ్వర్ పాల్గొన్నారు.

ఐసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

బెల్లంపల్లి, సెప్టెంబర్ 6 : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఐసెట్ కౌన్సెలింగ్ శుక్రవారం ప్రారంభమైంది. కో ఆర్డినేటర్ మారం దేవేందర్ ఆధ్వర్యంలో సిబ్బంది 275 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఈనెల 9 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన కొనసాగుతుందని కో ఆర్డినేటర్ తెలిపారు. ఈనెల 11 వరకు వెబ్ ఆప్షన్లను ఎంపిక చేసుకోవచ్చని వెల్లడించారు. చీఫ్ వెరిఫికేషన్ అధికారి డీ.రామదాసు, వెరిఫికేషన్ అధికారులు పీ.రాజమల్లు, బీ.శ్రీనివాస్, ఎస్.నాగరాజు, శివకుమార్, క్రిష్ణ పాల్గొన్నారు.

రైతు గోడు వినేదెవ్వరు..!

- వాతావరణ మార్పులతో పంటలకు తెగుళ్లు
- వ్యవసాయ క్షేత్రాల్లో ఉండాల్సిన అధికారులు రుణమాఫీ సర్వేకు..
- సలహాలు-సూచనలిచ్చే వారు లేక అన్నదాతల్లో ఆందోళన

మంచిర్యాల, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రభుత్వ నిర్లక్ష్యం రైతన్నలకు శాపంగా మారుతున్నది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంటలకు తెగుళ్లు సోకుతుండగా, సలహాలు-సూచనలు ఇవ్వాల్సిన వ్యవసాయశాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. తెగుళ్లతో పాటు ఎదుగుదల లోపించడం, ఎర్రబడటం, చెట్లు చనిపోవడం, ఆకు ముడతవంటివాటితో పంటలకు తీవ్ర నష్టం జరిగే పరిస్థితి నెలకొనగా, వ్యవసాయ విస్తరణ అధికారులు మాత్రం రుణమాఫీ లిస్టులను పట్టుకొని సర్వే పేరుతో ఊరూరా తిరగాల్సి వస్తున్నది. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 54 క్లస్టర్‌లలో ఈ సర్వే కొనసాగుతుండగా, ఏఈవోలు సుమారు 16 వేల మంది రేషన్ కార్డులు లేని వారి వివరాలను సేకరించి ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ప్రారంభమై 10 రోజులవుతుండగా, మరో 20 రోజుల వరకు ఈ సర్వే కొనసాగే అవకాశమున్నది. రూ. 2 లక్షల రుణమాఫీపై చేతులెత్తేసిన సర్కారు ఇలా సర్వే పేరిట ఏఈవోలను వ్యవసాయక్షేత్రాలకు దూరం చేయడమేమిటని పలువురు మండిపడుతున్నారు.

కోటపల్లిలో రేషన్ కార్డు లేని రైతు కుటుంబంతో ఫొటో దిగుతున్న ఏఈవో

కేసీఆర్ సర్కారులో..

పంటల సాగులో రైతులకు సలహాలు-సూచనలు అందించేందుకు కేసీఆర్ సర్కారు ఏఈవోలను నియమించింది. మండలాల్లో వ్యవసాయ క్లస్టర్‌లను ఏర్పాటు చేసి ఒక్కో క్లస్టర్‌కు ఒక్కో ఏఈవోను నియమించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంది. కానీ కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ పేరిట ఏఈవోలకు అదనపు భారం మోపి రైతులకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నదంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మొన్న

శాంతించిన గోదావరి

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 6 : భారీ వర్షాలకు నిన్నమొన్నటి దాకా ఉధృతంగా ప్రవహించిన మంచిర్యాల గోదారి.. నేడు శాంతించింది. ఇటీవల కురిసిన వానలకు ఎస్సారెస్పీ, కడెం, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తి లక్షల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదిలారు. ఏడాది తర్వాత గోదావరి నిండుకుండలా ప్రవహించడంతో పట్టణవాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. ప్రస్తుతం వానలు లేకపోవడంతో ప్రాజెక్టుల గేట్లు పూర్తిగా మూసివేయగా, గోదావరికి వరద ఉధృతి తగ్గి ఇసుక దిబ్బలు బయటపడ్డాయి.

నేడు

మట్టి గణపతి నమోస్తుతే..

పర్యావరణ హితం.. మట్టి ప్రతిమలు

- అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- ఎకో ఫ్రెండ్లీ గణపతులకు ఏటా పెరుగుతున్న ఆదరణ
- నేడే వినాయక చవితి.. మండపాల నిర్వహణలో భక్తులు

మంచిర్యాలలో మట్టి వినాయకులను కొనుగోలు చేస్తున్న ప్రజలు

చెన్నూర్ టౌన్ : అమ్మకానికి ఉంచిన మట్టి విగ్రహాలు

మంచిర్యాల అర్బన్/చెన్నూర్ టౌన్, సెప్టెంబర్ 6 : ప్రకృతిలో మమేకమవుతూ నేలా, నీరూ, చెట్టూ.. పుట్టా.. తదితర వాటిని ఆరాధించడం మన సంస్కృతిలో అనాదిగా వస్తున్న ఆచారం. హిందువుల పండుగల్లో వినాయక చవితికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ పర్వదినం నాడు వీధివీధినా వినాయక విగ్రహాలను నెలకొల్పి తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల 7న వినాయక చవితి పండుగ కోసం ఊరూరా ఏర్పాట్లు చేస్తున్నారు.

మట్టి ప్రతిమలే మేలు..

మట్టితో రూపొందించే విగ్రహాల వల్ల పర్యావరణానికి ఎలాంటి హానీ ఉండదు. చెరువు దరిలో బంకమట్టికి కొదవ ఉండదు. ఈ మట్టితో చేతిలో ఇమిడే విగ్రహాలు మొదలుకొని, కంకబొంగులు, జనుపనార, గడ్డి, పీచు సాయంతో పెద్ద విగ్రహాలనూ రూపొందించవచ్చు. వీటికి సహజ రంగులు అద్దితే ఆకర్షణలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలకు ఏమాత్రం తీసిపోవు. మట్టి విగ్రహాలను తయారు చేసినప్పుడు మట్టిలోని ధాతువులు మనుషులకు అంటుకొని మంచి ఆరోగ్యాన్ని స్తాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

పలువురి ఆదర్శం..

జిల్లాలోని కొన్ని చోట్ల పర్యావరణ ప్రేమికులు మట్టి గణపతి విగ్రహాలనే ఏర్పాటు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ హితాన్ని కోరుకునేవారు మట్టి విగ్రహాలను ఊరూరా ఉచితంగా పంపిణీ చేస్తూ ప్రకృతిపై తమ ప్రేమను చాటుకుంటున్నారు. చెన్నూర్‌కు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు మహేశ్ కూడా ఏటా మట్టి విగ్రహాలను తయారు చేస్తూ పర్యావరణ హితానికి తోడ్పడుతున్నారు. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తక్కువ ధరలోనే పలువురికి విగ్రహాలను అందిస్తున్నారు. చెన్నూర్ పట్టణానికి చెందిన విశ్వకర్మ గణేశ్ మండలి వారు ఏటా మట్టితో చేసిన వినాయకుడిని మండపంలో ప్రతిష్ఠించడం ఆనవాయితీగా వస్తుండడం విశేషం.

మార్కెట్లో సందడి...

మార్కెట్‌లలో సందడి నెలకొంది. వినాయకుడిని కొలిచేందుకు కావాల్సిన ఎలక్కాయలు, తామరపూలు, మామిడి ఆకులు, ఉసిరి, సీతాఫలాలు, పూజా సామగ్రిని భక్తులు కొనుగోలు చేశారు.

సాయినాథ్ లాడ్జిపై మరోసారి దాడి

- వ్యభిచారం కేసులో మేనేజర్‌తో పాటు ఆరుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ బన్సీలాల్

వివరాలు వెల్లడిస్తున్న మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 6 : జిల్లా కేంద్రంలోని సాయినాథ్ రెసిడెన్సీ లాడ్జిలో వ్యభిచారం కేసులో ఆరుగురు యువకులతో పాటు లాడ్జి మేనేజర్‌ను అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. శ్రీ సాయినాథ్ రెసిడెన్సీపై శుక్రవారం దాడి చేయగా, ఆకెనిపల్లికి చెందిన సుంకరి శివయ్య, గోదావరిఖనికి చెందిన మందాల శివ ఆశీష్, ఆకుల ప్రశాంత్, రౌతు కార్తీక్, వెల్గటూర్‌కు చెందిన గోస్కుంలా ప్రశాంత్, లక్షెట్టిపేటకు చెందిన తిరుపతి.. ఆరుగురు మహిళలతో వ్యభిచారం చేస్తూ పట్టుబడ్డారు. లాడ్జి నిర్వాహకులు డబ్బులు తీసుకొని వ్యభిచారాన్ని ప్రోత్సహిస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో లాడ్జి మేనేజర్ మోటం జనార్దన్‌తో సహా ఆరుగురు విటులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. రూ.6600లను సీజ్ చేశారు. యువకులతో పట్టుబడిన మహిళలను పట్టణంలోని సఖీ సెంటర్‌కు తరలించినట్లు తెలిసింది. లాడ్జి ఓనర్ సిరిపురం శ్రీనివాస్‌ను త్వరలో అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐలు సనత్‌కుమార్, సురేశ్, సిబ్బంది ఉన్నారు. కాగా, జూలై 25న ఇదే లాడ్జిలో వ్యభిచారం కేసులో ఓనర్‌తో పాటు ఇద్దరి యువకులను అరెస్ట్ చేయడం గమనార్హం.